# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పౌరులంతా దేశ సాంస్కృతిక, మేధో వారసత్వాన్ని అర్థం చేసుకుని, సాంప్రదాయాలను బలోపేతం చేయాలని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పిలుపునిచ్చారు.

- ❖ జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (JNCASR) శాస్త్రవేత్తలు మంకీపాక్స్‌ను గుర్తించేందుకు నూతన విధానాన్ని కొనుగొన్నారు.

- ❖ మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ రేపు ఉదయం ప్రారంభం కానుంది.

- ❖ గడచిన 10 సంవత్సరాల్లో భారత దేశంలోని ఈశాన్య ప్రాంతం పలు రంగాలలో గణనీయమైన పరివర్తనను చూసిందని బీజేపీ అధ్యక్షుడు జె.పి. నడ్డా అన్నారు.

==========================

దేశ పౌరులంతా నేషన్ ఫస్ట్ విధానాన్ని అవలంబించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు ఆమె హైదరాబాద్‌లో జరిగిన లోక్ మంథన్ 4వ ఎడిషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పౌరులంతా దేశ సాంస్కృతిక, మేధో వారసత్వాన్ని అర్థం చేసుకుని, సాంప్రదాయాలను బలోపేతం చేయాలన్నారు. భారత్... అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ జాతీయ సమైక్యతా భావన దేశాన్ని ఏకతాటిపై నిలిపిందని చెప్పారు. భారత సమాజాన్ని విభజించి బలహీనపరిచేందుకు శతాబ్దాలుగా అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ప్రాచీన కాలం నుంచి భారతీయ భావజాలం ప్రభావం ప్రపంచంలో ఎంతగానో వ్యాపించిందనీ, భారతదేశ మత విశ్వాసాలు, కళలు, సంగీతం, సాంకేతికత, వైద్య విధానాలు, భాష, సాహిత్యాలను యావత్ ప్రపంచం ప్రశంసించిందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ తదితరులు హాజరయ్యారు. రెండు రోజుల హైదరాబాద్ పర్యటన అనంతరం రాష్ట్రపతి బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన 10 సంవత్సరాల్లో భారత దేశంలోని ఈశాన్య ప్రాంతం ఆర్థిక, భద్రత, వైద్య, విద్యా రంగాలలో గణనీయమైన పరివర్తనను చూసిందని బీజేపీ అధ్యక్షులు జె.పి. నడ్డా అన్నారు. నిత్యం తుపాకీ కాల్పులు, పేలుళ్లతో ఉండే ఈశాన్య ప్రాంతం... స్వతంత్ర్యం వచ్చిన తరువాత మొదటి సారిగా శాంతి, శ్రేయస్సు, పురోగతని చూస్తోందని పేర్కొన్నారు. మణిపూర్ హింసాకాండకు సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖపై నడ్డా స్పందించారు. ఈ మేరకు ఆయన ఖర్గేకు లేఖ రాస్తూ... మణిపూర్ అంశాన్ని కాంగ్రెస్ సంచలనం చేసిందన్నారు. మణిపూర్‌లో శాంతికి విఘాతం కలగడానికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆయన లేఖలో ఆరోపించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జవహర్ లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (JNCASR) శాస్త్రవేత్తలు మంకీపాక్స్‌ను గుర్తించేందుకు కొత్త విధానాన్ని కనుగొన్నారు. మంకీపాక్స్ వైరస్ జన్యువులోని DNA సన్నివేశాలను శాస్త్రవేత్తలు గుర్తించి, వర్గీకరించారని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంపాక్స్ ఏ విధంగా వ్యాపించేది తెలియకపోవడంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధిపట్ల తీవ్ర ఆందోళన నెలకొంది. అసాధారణ DNA నిర్మాణాలను కలిగి ఉండడమే దీనికి కారణమని శాఖ తెలిపింది. ఇటువంటి అసాధారణమైన నిర్మాణం ఇతర పాక్స్ వైరస్ లలో కాని, వ్యాధి కారక క్రిములలో కాని, మానవ జన్యువులో కాని లేవని పేర్కొంది. కాగా... ప్రస్తుతం శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన విధానం ఎంపాక్స్ వైరాలజీని అర్థం చేసుకోవడానికి, రోగ నిర్ధారణ, చికిత్సా విధానాలను అభివృద్ధి చేయడానికి సహాయపడుతుందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర వ్యాప్తంగా రేపు జరగనున్న 288 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఈ ఎన్నికలలో రికార్డు స్థాయిలో 66 శాతం పోలింగ్ నమోదైందని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం తెలిపింది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, తరువాత 8 గంటల 30 నిమిషాలకు ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరగనుంది. మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 24 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రధాన ఎన్నికల అధికారి కె. రవి కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నామని ఆయన తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో శాంతిభద్రతల విషయంలో ఎటువంటి అలసత్వం సహించబోమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈరోజు ఢిల్లీ పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించి శాంతిభద్రతలపై సమీక్షించారు. నేరాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం

“జీరో టోలరెన్స్” విధానంతో ఉందని పేర్కొన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రత... ఢిల్లీ పోలీసుల ప్రాధాన్యత కావాలని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ దేకా, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ మత్స్యకార నౌక మార్తోమా గోవా సమీపంలో భారత నౌకాదళ జలాంతర్గామిని ఢీకొన్నట్టు భారత నౌకాదళం తెలిపింది. ఘటన జరిగిన వెంటనే భారత నావికాదళం స్పందించి, 6 నౌకలు, విమానాలతో శోధన, సహాయ చర్యలను మొదలు పెట్టింది. మొత్తం నౌకలో 13 మంది ఉండగా... ఇప్పటి వరకు 11 మంది సిబ్బందిని రక్షించామని, మిగిలిన ఇద్దరిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని నావికాదళం తెలిపింది. సహాయ చర్యలను మరింత పెంచేందుకు కోస్ట్ గార్డ్‌తో సహ అదనపు దళాలను ఆ ప్రాంతానికి మళ్లించామని పేర్కొంటూ... ఘటనకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు నేవీ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకే 29 మంది డెప్యూటీ మంత్రులను నియమించడం ద్వారా తన మంత్రివర్గాన్ని విస్తరించారు. గత  సోమవారం ఆయన 21 మంది మంత్రివర్గ సభ్యులతో గత కొన్ని దశాబ్దలతో పోల్చి చూస్తే అతి చిన్నదైన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. తాజాగా మరో 29 మంది డెప్యూటీ మంత్రులను నియమించడంతో మొత్తం మంత్రుల సంఖ్య 50కి చేరింది. శ్రీలంక రాజ్యాంగం ప్రకారం గరిష్ఠంగా 30 మంది కేబినెట్ మంత్రులను, 40 మంది డెప్యూటీ మంత్రులను నియమించేందుకు అవకాశం ఉంది. కాగా... ఈరోజు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో అనిల్ జయంత ఫెర్నాండో, హర్షన సూరియప్పెరుమ, నమల్ కరుణరత్నే, మహమ్మద్ మునీర్, నలిన్ హెవగే తదితరులు ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరుణిష్ చావ్లా... 2022 - 2023 సంవత్సరాలకు సంబంధించిన ఈ అవార్డులను 82 మంది యువ కళాకారులకు అందజేశారు. సంగీతం, నృత్యం, నాటకం, జానపద, గిరిజన కళా రూపాలకు సంబంధించి 40 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగిన కళాకారులకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ అవార్డు కింద 25 వేల రూపాయల నగదు బహుమతిని కూడా అందజేస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు సహాయం అందించేందుకు ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, విద్యా మంత్రిత్వ శాఖలతో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఈ ఒప్పంద కార్యక్రమంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జే.పీ.నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ... ఈ ఒప్పందం ప్రజలకు ప్రయోజనానికి, ఉమ్మడి లక్ష్యాలను సాధించడానికి సహాయకారిగా ఉంటుందన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌ను ప్రపంచ స్థాయి సంస్థగా నెలకొల్పేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

“మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆస్ట్రేలియాలో జరుగుతున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీ లో భాగంగా మొదటి టెస్ట్ మ్యాచ్ పెర్త్ స్టేడియం వేదికగా ఈరోజు ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 150 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముసిగే సమయానికి 67 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. 83 పరుగుల ఆధిక్యంలో భారత్ నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =